

# డైలాగుల్లో కథ

''పెళ్లెందుకు చేసుకోవు?''

''అత్తవారందరికీ బ్రహ్మరథం పట్టాలి. చదువు, డబ్బు, అందం, గొప్పింటి అమ్మాయయినా ఆడదాని గతి అంతే. అందుకని చేసుకోను''.

'' ఏకాకిని చేసుకోవచ్చునే?''

''దాని పేరే మాయ. మొదట్లో యేకాకిలాగా కనిపిస్తాడు. గుడ్డి మోహం గెలుస్తుంది. పెళ్లి వెలిగేస్తే, పుట్టలోంచి పాములల్లే, చాలా మంది బంధువులు రాకపోకలు సాగిస్తారు. మెత్తగా వున్నవారిని చూడగానే మొత్త బుద్ధవుతుంది. పెళ్లాడినవాడి అమ్మ పెద్దమేనమామ పెద్ద కొడుకు కోడలు పెద్ద చెల్లెలు గూడా వచ్చి పూసుకుతిరిగి కలుపుగోలుతనంగా వుండి, దర్పంగా మాట్లాడుతూ బాగా క్షవరం చేసి మరీ వెళ్తుంది. పెళ్లాడిన శాల్తీయేమో'' దానికి నేనంటే యెంతో యిది. మొన్న వచ్చి వెళ్లిన మా పిన్ని కోడలు బాగున్నది గదూ, నిన్ను మెచ్చింది!'' అంటాడు.

''కబుర్లు చెప్పుకోటానికీ, కడుపులో బాధ చెప్పుకోటానికన్నా చేసుకోవచ్చుగా''.

''అదీ భ్రమే. నే కబుర్లాడుతుంటే వినలేడు. చేదుమందు తాగమన్నట్టు చూస్తాడు. జోగుతాడు. ఆవలిస్తాడు. గోక్కుంటాడు. గురకపెడతాడు. పాము పొట్ట వుబ్బిస్తున్నట్టు, పెద్దదీ చిన్నదీ చేస్తాడు. తాను చెప్పే కబుర్లు నేను చెవులు దోర పెట్టుకు వినాలి. ఇహిహీ అనాలి. యెంత గొప్పవాళ్లు. యెంత ఔదార్యం అనాలి. నాకు ఒకపండితుడు బంధువున్నాడు. తనను తాను వర్ణించుకునేప్పుడు

సంస్కృత పదాలు వాడతాడు. పెళ్లాన్ని వర్ణించాల్సి వస్తే ''దాని ముట్టె యెత్తు. బండ పెదిమలతో ఆదివాసిలాగా ఆఫ్రికన్ లాగా వుంటుంది. లొడలొడమని మాట్లాడుతుంది. బెకబెకమంటుంది. నేను శ్లోకం చదువుతుంటే గండుకోయిల గళములాగా వుంటుంది. నేను సింహ మధ్యముడిని. దాని నడుము రుబ్బురాయిలాగా వుంటుంది. పదహారు ఫలాల నోము పట్టానని మంకుపట్టు పడితే, ఆ వ్యాధి కుదర్చాలని, విషాముషిణి వేపపళ్లు, కంచెగుబ్బలు, కుంకుడు పళ్లు, పుల్ల పళ్లు, కాకర పళ్లు మొదలైనవి తెచ్చిచ్చా'' అన్నాడా బంధువు.

''పెళ్లినాడు ప్రమాణాలు చేయిస్తారు. ఒప్పందాలయాకే నిశ్చితార్థం జరుగుతుంది. పోనీ ఒక వెల్‌విషర్ న్యాయవాదిని తెచ్చుకుని దస్తావేజు వ్రాయించుకోవచ్చు'' అన్నాడా సరసుడైన సూటరు.

''అవన్నీ హూష్ కాకి అని గాల్లోకెగురుతున్నాయి. మానవహక్కుల పరిరక్షణ, సిద్ధాంతాలు, ఆదర్శాలు, మానవత, పుణ్యము, పురుషార్థము, మంచి పేరూ, ప్రతిష్ఠ అనేవి వాడబడతాయి. ప్రలోభపెట్టి లొంగదీసి అణిచివుంచుతాడు. అదే మగతనం. అలా అణిచి వుంచలేకపోతే చాతగాని దద్దమ్మ అంటారు. అలివిగాని ఆలి గట్టుకూ అని సామెత చెప్పి నవ్వుతారంటాడు''.

''కడుపున పుట్టిన బిడ్డల్ని ముద్దుగా పెంచుకోలని వుండదా? స్త్రీత్వం లేదా?'' రీజన్ చేస్తున్నాననుకున్నాడు సూటరు.

''కననివ్వడు. పిల్స్ కొనిస్తాడు. నియంత్రణ నేర్పుతాడు''.

''నువ్వు అలాగ్గా కనేయగానే అయిపోదు. పెంచి పెద్ద చేసి ప్రయోజకులని చేయటం నా వంతు అవుతుంది'' అంటాడు.

''మొండికేసి కనేస్తే, పెట్టుబడి తనది కనక, సపోర్టు చేసేది తను గనక తనిష్టమొచ్చినట్టు పెంచుతానంటాడు. మూఢ నమ్మకాలు కలిగించరాదు. మోడరన్ కావాలి. పెళ్లి పేరెత్తద్దుట. సంఘాన్నెదిరించాలిట. శక్తిని చదువుమీదా జాబ్ మీదా సంపాదన మీదా స్టేటస్ మీద కేంద్రీకరించాలి. యెత్తుకుని ముద్దు చేయరాదు''.

''దింపేయ్. దింపేయ్. మోస్తావేం?'' అని మొరుగుతూ వచ్చి బిడ్డను లాగి కింద కూలేస్తాడు తనవేపు ఆడపిల్లలు తల్లులై మోస్తుంటే, మా అమ్మాయి కృష్ణుడిని యెత్తుకున్న యశోదలాగా వుంది గదూ! అది కడుపుతో వున్నప్పుడింకా బావుంది. నువ్వెళ్లి చూసిరా అంటే అసూయ వల్ల వెళ్లలేదు నువ్వు. మా పిన్ని కూతుర్ని చూడటానికి వెళ్లితే, నీ మేనగోడలికి యేడో నెల వచ్చింది. చూసిరా. సూడిదలకి డబ్బిచ్చి, దీవించిరా'' అన్నది. అలాగే చేశా. నా మేనగోడలు కన్నుల పండువుగా కనిపించింది. రిస్టువాచీ కొనిచ్చా. నీ కట్టి ఔదార్యమేదీ? కుళ్లగుణాలు నువ్వూ'' అంటాడు.

సూటరు నవ్వాడు ''హ్యూమరూ అనుభవం యెలా వచ్చాయి?''

''జన్మపరంపరల చేత వచ్చాయి''.

''సపోజ్ నేను ప్రపోజ్ చేయదలచాననుకుందాము. యు ఆర్ ఫ్రీ టు క్లియర్ యువర్ డౌట్స్. ప్రశ్నలకి విసుగుజెందను. చిన్న సందేహం?'' అన్నాడు నవ్వుతూ.

''మరి పెళ్లి చేసుకునే వాళ్లెలా కానిస్తున్నారు?''

''అదా? యేదో యిక్కట్టు దాటాలని. పరిస్థితులు వాతావరణం పడక

వేసారి తప్పించుకోవాలని. సెక్యూరిటీ లాభం చూసుకుని, ఒంటరిగా వుండలేక, ఆస్తికి వారసులు కావాలని, గొప్పవారితో వియ్యమందాలని, రోజూ తన స్వంత ఘోషవినే మనిషికావాలని, తన ఆశయాలు యెదుటి మనిషిపై రుద్దాలని, నియంత కావాలని, నాదీ అనే ప్రాణి కావాలని, తను పోయినా, తన ఆశయాలు నెరవేరుస్తారని, తన సంపాదన కాపాడే మనిషి కావాలని, ఎక్స్ట్రా యెఫేర్సు వెలిగించవచ్చునని'' అని చెప్పుతూ సూటర్ వంక చూస్తే అతని మొహంలో రక్తం గూడు కట్టటం కంటబడి ఆపేసింది.

సంబాళించుకుని తెల్లని మొహంతో నవ్వుతూ చూచాడు.

''మరి ప్రశ్నలేసి సందేహాలు తీర్చుకోరూ?'' అన్నాడు.

''మీ వాళ్లని తలుచుకోకుండా వుండగలరా? పూల్లవెంట తిరగరు గదా? బ్యూటీ కంటబడగానే కన్నార్పకుండా చూడరు గదా? జీతమంతా ముద్ర శుద్ధిగా నా చేతబెట్టి యెలా ఖర్చు చేశావని అడగరు గదా? నన్ను కంట్రోల్ చేయాలని, అణిచి వుంచాలనీ అనుకోరు గదా! సూటీ పోటీలూ, వెక్కిరింత, దెప్పటం వుండవు గదా? దీనికి పుట్టింటి వేపునించేమీ చెందలేదే అని వ్యధ చెందరు గదా? అన్నీ నేనే చేయాలా దీనికీ అని కన్నీరు నింపరు గదా? దిగాలు పడరు గదా? పై ఆఫీసర్లు విందుల్లో తారసిల్లి, పలకరించినా, గౌరవించినా ''దీనికెంత అదృష్టం పట్టిందీ నా వల్ల'' అని కుమలరు గదా. నా మీద నిఘా వుంచుతారా? నేను ప్రామిస్ చేశాను పంపుతానని అంటూ ముక్కూ మొహం తెలియని వారి వెంట తోలరు గదా? పుష్కలంగా డబ్బు యియ్యకుండా శూన్యహస్తాలతో మీ యింటికి పొమ్మంటారా? అలా పంపితే చాపకింద నీరు వదులుతారని తెలుసా?'' అంటున్నది.

నవ్వుతూ తలూపుతూ వింటున్నవాడు పకపకా నవ్వాడు.

''అలా వదిలితే యేమౌతుందని వారి అయిడియా?'' అనడిగాడు.

''ఇంతే నా తెలివి? యెవరి చాపకిందికి నీరొస్తే వారే లేచిపోతారు. పొమ్మని నోటితో అనే అవసరముండదు. పొమ్మనలేక పొగపెట్టినట్లు సామెతకీ యిదే అర్థం'' అన్నది.

దయగా చూశాడు. సింపథిటిగ్గా అన్నాడు'' యెక్కువ వయస్సు లేదే మీకూ? అవన్నీ అనుభవం మీద అడిగినట్లున్నాయి''.

''థాంక్స్. యు ఆర్ కన్సిడరేట్. చెప్పాగా జన్మపరంపరలున్నాయని''.

''పూర్వ జన్మ జ్ఞానమున్న దంటున్నారా?''

''అంత గొప్పదాన్ననటం లేదు. సాటి స్త్రీలు వాళ్ల అనుభవాలు చెప్పారు. మరపురాలేదు. త్యాగ బ్రహ్మం, ''దుష్టులతో చేరి దుష్కృత్యముల చేసి రట్టు చేసిన త్యాగరాజుని దయతో యెటులా బ్రోతువో తెలియదే కాంతరామయ్యా'' అని కంపోజ్ చేశారు. స్వామి నిజంగా దుష్టులతోనూ చేరలేదు, దుష్కృత్యము చేయలేదు. రట్టూ చేయలేదు. ప్రపంచం తీరు తెన్నులు చూసి ఆనందించి కంపోజ్ చేశారు'' అన్నది.

''యేమిటి తేలింది?''

''అంతా భ్రమ. పెళ్లాడినా జీవితం చివరివరకు సాఫీగా వెళ్లదు. ఇద్దరిలో యెవరో ఒకరు లొంగి అణిగి వుండాలి. పెద్ద లీడర్సు, నేతలు, శాస్త్రజ్ఞులు అంతా ఒకటే. బాపూ చూడండి కస్తూరిబాను బాగా అణిచివుంచి తాను

కీర్తిమంతులైనారు. జైల్లోపోతే నిన్ను దేవతగా తలుస్తాను'' అన్నారు. కాని ''బాగా సహకరించావు'' అనలేదు. నన్నే అంటిపెట్టుకున్నావు'' అనలేదు. నోబెల్ బహుమతి గ్రహీతలూ అంతే''.

''మరి స్త్రీల మాటేమిటీ?''

''నాకు పక్షపాతం లేదు. స్త్రీలూ అంతే. మీరు సరిగా విన్నట్లులేదు. దంపతులలో యెవరో ఒకరు అణిగి వుండాలి అన్నా''.

''మనం వచ్చే జన్మలో తప్పకుండా కలిసి జీవిద్దాం'' అని లేచాడు సూటరు.

'' ఓకే. గుడ్ బై'' అన్నది.